
AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

## డిప్యూటీ సీఎం కుమారుడి వివాహ మహోత్సవంలో ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య సాక్షి వివాహం ఈనెల 5న జరగనుంది. వేడుకకు సంబంధించి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. కాగా.. బుధవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన పెళ్లికొడుకు వేడుకలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు దంపతులు పాల్గొన్నారు.


4-3-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2








# ఊరూవాడా.. రంగుల హోరు

ఊరూవాడ రంగులమయమైంది. హోలీ పండుగను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా సంబరాలు నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. చిన్నాపెద్ద తేడాలేకుండా ఆడిపాడారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారితో పాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, కార్పొరేటర్లు రంగులతో సందడి చేశారు. మార్వాడి గల్లి, వైశ్య సంఘంలో యువతీయువకులు రంగుల కేళీలో మునిగితేలారు. - అక్షరటుడే, ఇందూరు

## డ్రైవర్లకు కంటి చూపు ముఖ్యం : ఎస్పీ




**అక్షరటుడే, కామారెడ్డి:** డ్రైవర్లకు కంటిచూపు చాలా ముఖ్యమని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ కార్యాలయంలో బుధవారం డ్రైవర్లకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 136 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించగా 20 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. చికిత్సలు అవసరమైన డ్రైవర్లకు డోనర్ల సహకారంతో పోలీస్ శాఖ తరపున చికిత్స చేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి, పట్టణ సీఐ నరహరి, ట్రాఫిక్ ఎస్సై మహేష్, దేవునిపల్లి ఎస్సై రంజిత్, డ్రైవర్లు పాల్గొన్నారు.

## కారేగాం డీఫ్లోరైడ్ స్కీంను పరిశీలించిన అధికారులు



**అక్షరటుడే,కోటగిరి:** పోతంగల్ మండలంలోని కారేగాం డీఫ్లోరైడ్ స్కీంను మిషన్ భగీరథ అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంజీరాలో ఉన్నటువంటి, వైర్లు పైప్ లైన్లు మోటార్లను పరిశీలించారు. గత వర్షాకాలంలో వరదలతో కొట్టుకుపోయిన పైపు లైన్లు, కేబుల్లను మరమ్మతులు చేయించేందుకు స్థానిక సర్పంచులతో కలిసి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఏఈ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో స్థానిక సర్పంచులు మోటార్ల మరమ్మతుల విషయమై కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం కొట్టుకుపోయిన వైర్లు, కేబుల్లకు మరమ్మతులు చేయించేందుకు ప్రణాళిక వేస్తున్నామన్నారు. రాబోయే ఎండాకాలంలో నీటిసమస్య రాకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో మెగా ఇంజినీర్ విష్ణు, సర్పంచులు సునీల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కామారెడ్డి మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. ఫలితాల అనంతరం రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మొన్నటి వరకు ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు మధ్య మాటల యుద్ధం సాగగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి ఎన్నికపై వివాదం మొదలైంది. కౌన్సిలర్‌గా ఆమె ఎన్నిక చెల్లదని కాంగ్రెస్ అభ్యర్థి కోర్టును ఆశ్రయించారు. ఉమారాణి దొంగ ఓట్లతో గెలిచారని ఆరోపించారు. దీనిపై వచ్చే నెల 6న కోర్టు విచారణ చేపట్టనుంది. - అక్షరటుడే, కామారెడ్డి



# ఓట్ల రాజకీయం!

- చైర్‌పర్సన్‌కు పదవి గండం
- కోర్టును ఆశ్రయించిన ప్రత్యర్థి
- రీపో లింగ్‌కు డిమాండ్
- రసవత్తరంగా కామారెడ్డి రాజకీయాలు

కామారెడ్డి పట్టణంలో 38వ వార్డు ఇప్పుడు మున్సిపల్ రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారింది. ఆ వార్డులో కాంగ్రెస్ తరఫున రంగ మాధవి పోటీ చేశారు. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ ఇప్ప ఉమారాణి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి రంగ మాధవిపై ఉమారాణి 3 ఓట్ల తేడాతో గెలుపొందారు. రీ కౌంటింగ్ చేసినా అవే ఫలితాలు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఆమె అనూహ్యంగా చైర్‌పర్సన్ పదవి దక్కించుకున్నారు. కౌన్సిలర్‌గా ఆమె ఎన్నిక చెల్లదంటూ రంగ మాధవి కోర్టులో పిటిషన్ వేశారు.

### ఇతర గ్రామాల ప్రజలతో..

ఉమారాణి దొంగ ఓట్లతో గెలిచారని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎన్నిక జరిగిందని ప్రత్యర్థి రంగ మాధవి కోర్టును ఆశ్రయించారు. ఇతర వార్డులు, ఇతర గ్రామం నుంచి ఓటర్లను చేర్చి ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయించి గెలుపొందారని ఆరోపణలు చేశారు. ఉమారాణి స్వగ్రామం రాజంపేట కాగా.. అక్కడి ప్రజలకు కొందరికి వార్డులో ఓటర్లుగా నమోదు చేయించారని ఆరోపించారు. వారితో దొంగ ఓట్లు వేయించారన్నారు. రాజంపేట ఉపసర్పంచ్‌తో పాటు, మరో 15 మంది, జంగంపల్లి పాఠశాలలో పని చేసే ఓ ఉపాధ్యాయుడు దొంగ ఓట్లు వేసినట్లు ఆమె పేర్కొన్నారు. దీనిపై కోర్టు ఎలా స్పందిస్తుందో చూడాలి.

### దొంగ ఓట్లతోనే గెలిచారు..: 38వ వార్డు అభ్యర్థి రంగ మాధవి

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీ లోని 38వ వార్డులో దొంగ ఓట్లతోనే ఇండిపెండెంట్ కౌన్సిలర్ అభ్యర్థి, ప్రస్తుతం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి గెలిచారని ప్రత్యర్థి అభ్యర్థి రంగ మాధవి ఆరోపించారు. ఈ మేరకు తన నివాసంలో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. కౌన్సిలర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ కేటాయించిందని, స్వతంత్ర అభ్యర్థిగా ఇప్ప ఉమారాణి పోటీ చేశారన్నారు. అయితే తమ పార్టీ ముఖ్య నాయకుడి సోదరుడు అందరికి ఫోన్‌చేసి పార్టీ టికెట్ ఇచ్చినా స్వతంత్ర అభ్యర్థే మన అభ్యర్థి అని వారికే ఓటు చేయాలని చెప్పారని ఆరోపించారు. చైర్మన్ ఉమారాణి స్వగ్రామం రాజంపేట అని, ఆ గ్రామం నుంచి కొంతమందికి 38వ వార్డులో ఓటు హక్కు కల్పించారన్నారు. రాజంపేట ఉప సర్పంచ్‌గా ఉన్న మీర్ ఇమ్రాన్‌తో పాటు ఆ గ్రామానికి చెందిన 15 మంది, జంగంపల్లి గ్రామంలో హిందీ పండిత్‌గా పనిచేస్తున్న అబ్దుల్ గఫూర్ దొంగ ఓట్లు వేశారని ఆరోపించారు. అలాగే 40, 37, 39 ఇతర వార్డుల నుంచి 38వ వార్డులో ఓటు వేశారన్నారు. తమ వార్డులో 5811 నుంచి 5818 నంబరు గల ఇళ్లపై 50 దొంగ ఓట్లు ఉన్నాయని, హిందువుల ఇళ్లపై ముస్లింల ఓట్లు చేర్చారని రంగ మాధవి అన్నారు. ఈ విషయమై జనవరి 8న మున్సిపల్ అధికారులకు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

## నిజాంసాగర్ నీటి విడుదల



**అక్షరటుడే, కోటగిరి:** నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగుచేస్తున్న యాసంగి పంటల కోసం నీటి విడుదల చేపట్టారు. ఈ మేరకు నిర్ణయం తీసుకోగా.. ప్రాజెక్టు నుంచి బుధవారం నీటిని విడుదల చేశారు. ప్రధాన కాలువ ద్వారా 4వ విడతలో భాగంగా.. 1200 క్యూసెక్కుల చొప్పన నీటిని బుధవారం మధ్యాహ్నం 12:30 గంటలకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో కాల్వల పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు, రైతులు, పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని, కాలువలోకి లేదా కాలువ ఒడ్డు సమీపానికి వెళ్లవద్దని అధికారులు సూచించారు.

## అంగన్ వాడీల్లో విద్యుత్ వెలుగులు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రాజేశ్వరరావు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ లేని అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచితంగా కనెక్షన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 378 కేంద్రాలకు మంజూరు చేశామని స్పష్టం చేశారు. చిన్నారుల కోసం నిర్వహించే ప్రీస్కూల్ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు విద్యుత్ సౌకర్యం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇంకా కొన్ని కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్లతో పాటు అంతర్గత వైరింగ్ ఇతర సదుపాయాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ఇవి పూర్తిగా ఉచితమని తెలిపారు.

## విద్యార్థి ఆత్మహత్య ఘటనపై కలెక్టర్ సీరియస్

### నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్..

**అక్షరటుడే, ఇందూరు:** ఇందల్వాయి లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థి రామ్ చరణ్(15) ఆత్మహత్య చేసుకున్న ఘటనను కలెక్టర్ ఇలా త్రిపాఠి తీవ్రంగా పరిగణించారు ఘటనపై ప్రాథమిక విచారణ జరిపించారు. ప్రాంతీయ సమన్వయకర్త గంగారం నాయక్ నేతృత్వంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్ స్వామి, డాక్టర్ సైదా జైనబ్ ఫణి కుమార్, డాక్టర్ జ్యోతి ప్రాథమికంగా విచారణ జరిపి నివేదిక సమర్పించారు వీరి నివేదిక ఆధారంగా ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, హౌస్ మాస్టర్ కుల్దీప్ యాదవ్, హాస్టల్ వార్డెన్ విశ్వంభర్, మెస్ ఇన్‌ఛార్జి ఆకాష్ యాదవులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి..

జీవితంలో అనేక సమస్యలు వస్తుంటాయని వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఇందల్వా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను బుధవారం సందర్శించారు. అధ్యాపకులు, విద్యార్థులతో భేటీ అయ్యారు. రామ్ చరణ్ ఆత్మహత్య సంఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రామ్ చరణ్ బలవన్మరణానికి పాల్పడడం ఎంతో బాధ కలిగించిందన్నారు. ఆత్మహత్య ఆలోచనలు దరిచేరకుండా ఏకాగ్రతతో చదువుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. తప్పుడు నిర్ణయాలతో నిండు జీవితాన్ని నశానం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చవద్దని చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్సీవో గంగారం నాయక్ తదితరులున్నారు.

## మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తే చర్యలు తప్పవు

**అక్షరటుడే, కామారెడ్డి:** అధిక సౌండ్ కలిగిన సైలెన్సర్ల వినియోగిస్తే చర్యలు తప్పవని కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి హెచ్చరించారు. కామారెడ్డి పట్టణంలో దాదాపు 150 సైలెన్సర్లను బుధవారం రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. అత్యధిక శబ్దం కలిగిన సైలెన్సర్లతో విద్యార్థులు, వృద్ధులు, గర్భిణులు, రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఆకస్మికంగా వచ్చే అధిక శబ్దం ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా రోడ్డు ప్రమాదాలకు కూడా దారితీసే ప్రమాదం ఉందన్నారు. ప్రత్యేక తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయడం జరిగిందన్నారు.



## కాంగ్రెస్ పార్టీని సమష్టిగా ముందుకు తీసుకెళ్తాం..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కాంగ్రెస్‌ను సమష్టిగా ముందుకు తీసుకెళ్తామని పార్టీ నిజామాబాద్ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతనెల 21న ప్రారంభమైన శిక్షణ శిబిరంలో ఏఐసీసీ నాయకులు రాష్ట్ర మంత్రులు, మాజీ ఐఏఎస్ అధికారులు రోజుకొకరు చొప్పున శిక్షణ అందజేశారన్నారు. మొదటి రోజు రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తమ ప్రజంటేషన్ ఇచ్చారన్నారు. అనంతరం ప్రొఫసర్ కోదండరాం తదితరులు రంగాలకు సంబంధించిన వాటి గురించి శిక్షణ ఇచ్చారన్నారు.



## విజయ్ హైస్కూల్‌లో ఫేర్‌వెల్ పార్టీ

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని విజయ్ హైస్కూల్‌లో 2025-26 పదో తరగతి విద్యార్థుల కోసం ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయ్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ అమృత లత హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టి.కవితా దివాకర్, ప్రిన్సిపాల్ జి. రమాదేవి పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



**అక్షరటుడే, బాన్సువాడ:** లింగంపేట్ మండలంలోని రాంపల్లికి చెందిన శైలజకు పురిటి రావడంతో కుటుంబసభ్యులు ఆమెను బాన్సువాడలోని మాతాశిశు సంరక్షణ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా రక్తపోటు అధికంగా ఉండడం.. వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో మెరుగైనవైద్యం కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయితే మార్గమధ్యంలోనే శైలజకు నొప్పులు తీవ్రంగా పెరగడంతో 108 అంబులెన్సులోనే అత్యవసర పరిస్థితి ఏర్పడింది. ఈఎంటీ లక్ష్మణ్ సమయస్ఫూర్తితో ప్రసవం నిర్వహించారు. శైలజ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. డెలివరీ విజయవంతంగా నిర్వహించిన ఈఎంటీ లక్ష్మణ్, అంబులెన్స్ పైలట్ రాముకు శైలజ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తల్లి, శిశువును చికిత్స కోసం కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## సీపీఐ నాయకుడు బొజ్జ భూమాగౌడ్ జయంతి



**అక్షరటుడే, బాన్సువాడ:** సీపీఐ సీనియర్ నాయకుడు కామ్రేడ్ బొజ్జ భూమా గౌడ్ 5వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో సీపీఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన స్మారక సమావేశంలో ఆ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుబాస్ రాములు మాట్లాడుతూ.. బొజ్జ భూమాగౌడ్ కల్లుగీత కార్మికుల హక్కుల కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. మోస్రా గ్రామానికి చెందిన భూమాగౌడ్ జిల్లాలో కార్మికవర్గ సమస్యలపై అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్మిక వర్గ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గంపల సాయిలు, పుట్టి సాయిలు, రాపర్తి సాయిలు, ధర్మం చిన్న సాయిలు, నాగ్ రావు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## కాపర్ వైర్ దొంగల అరెస్ట్.. రిమాండ్

**అక్షరటుడే, కామారెడ్డి:** కాపర్ వైరు దొంగతనం చేసి పారిపోతున్న వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు కామారెడ్డి పట్టణ సీఐ నరహరి తెలిపారు. మంగళవారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో గొల్లవాడలో కాపర్ వైర్ దొంగిలించుకుని వెళ్తున్న ముగ్గురిని కాలనీ వాసులైన రాజేష్, వినోద్, అశోక్ ఆపి నిలదీశారు. దాంతో వెంట తెచ్చుకున్న నిందితులు రాడుతో ముగ్గురిపై దాడికి పాల్పడ్డారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దాడికి పాల్పడిన నవీద్, ఇజాస్, వసీం, హాజరుద్దీన్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఎండలు మండుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దీంతో ఏసీలు, కూలర్ల వినియోగం భారీగా పెరిగింది. ఫలితంగా విద్యుత్ డిమాండ్ సైతం పెరుగుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. 35 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతుంది. దీంతో విద్యుత్ డిమండ్‌కు తగినట్లు సరఫరా చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నిరంతర విద్యుత్తును అందించేందుకు సిద్ధంగా ఉన్నామంటున్నారు.

- అక్షరటుడే, ఇందూరు

# పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

■ వేసవిని తట్టుకునేనా.. ■ ప్రత్యేక ప్రణాళికతో అధికారుల చర్యలు

జిల్లా వ్యాప్తంగా లక్షల్లో గృహాలు, గృహేతర విద్యుత్ కనెక్షన్లు ఉంటాయి. అలాగే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సైతం భారీగా ఉన్నాయి. ప్రధానంగా వేసవి వచ్చిందంటే ఇల్లు, వ్యాపార సముదాయాల్లో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. సాధారణం కంటే రెట్టింపు స్థాయిలో డిమాండ్ పెరుగుతుంది. ప్రస్తుతానికి జిల్లా కోటా రోజుకు 13.37 మిలియన్ల యూనిట్లు ఉంటే..12.4 మిలియన్ల యూనిట్లు వినియోగిస్తున్నారు. మరికొన్ని రోజుల్లో దీని వినియోగం భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఏర్పాటు చేశారు.

### నిరంతర సరఫరా కోసం

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం శాఖాపరమైన చర్యలను చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా జిల్లాలో ఎక్కడ ఓవర్ లోడ్ సమస్య ఉందో గుర్తించి ముందుకెళ్తున్నారు. నిజామాబాద్ డివిజన్‌లో 68, బోధన్ డివిజన్‌లో 89, ఆర్మూర్‌లో 42, డిచ్‌పల్లిలో 57 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచారు. అలాగే అవసరం ఉన్నచోట కొత్తవి ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా ఏదైనా సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా సమస్య ఏర్పడితే సమీపంలోని సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేసేలా ఇంటర్ లింకింగ్ పనులను ప్రారంభించారు. ఇప్పటికే 33/11 కేవీకి సంబంధించి 35 లైన్ల పనులను పూర్తి చేశారు.

### రైతులకు అండగా...

గృహాలతో పాటు వ్యవసాయానికి వేసవిలో విద్యుత్ డిమాండ్ విపరీతంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఓవర్‌లోడ్, అకాల వర్షాలతో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతాయి. దీంతో వాటి రిపేర్ కోసం విద్యుత్ శాఖకు సంబంధించి మూడు, ప్రైవేటుగా 12 కేంద్రాలు సిద్ధంగా ఉంచారు. 48 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు పూర్తి చేసి అందించనున్నారు.

### టోల్ ఫ్రీ నెంబర్

వినియోగదారులకు విద్యుత్తుకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తిన ఫ్యూస్ ఆఫ్ కాల్‌తో పాటు అధికారులను సంప్రదించాలని సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ప్రత్యేక బృందాలు స్పందించేందుకు సిద్ధంగా ఉన్నాయి. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 1912కి సంప్రదించవచ్చు.

## ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలి



**అక్షరటుడే, ఇందూరు:** ఇందల్వాయి మండలం ఏకలవ్య పాఠశాలలో అభ్యసిస్తున్న విద్యార్థి రామ్ చరణ్ ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయల ఒత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపించారు. సంబంధిత వారిని కఠినంగా శిక్షించాలన్నారు. తమ కుమారుడికి ఎటువంటి ఇతర కారణాలు లేవన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఊరుకునేది లేదన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ రాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగో వార్డ్‌లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. మండలంలోని ముస్తాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. గ్రామంలోని అందరిని కలుపుకొని గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటికే భద్రాద్రి రాములోరి తలంబ్రాలు.. టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సేవ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందులో భాగంగా భద్రాద్రి సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవ తలంబ్రాలు, ముత్యాలను భక్తుల ఇంటి వద్దకే అందించే ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు టీజీఎస్ కార్గో నిజామాబాద్ ఇన్‌ఛార్జి డీఎం ఈ కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిలో మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సేవను పొందడానికి భక్తులు కేవలం రూ.151 చెల్లించి సమీప టీజీఎస్‌ఆర్టీసీ కార్గో కౌంటర్లలో (ఎల్లారెడ్డి బస్టాండ్) బుకింగ్ చేసుకోవచ్చు. కల్యాణం అనంతరం ఆ తలంబ్రాలను కార్గో ద్వారా నేరుగా భక్తుల ఇంటికి చేరవేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, కౌన్సిలర్లు సిద్ధి శ్రీధర్, గాదె తిరుపతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ త్రిఖండ సంఘటనా మంత్రి వినోద్, నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, ఇన్‌ఛార్జి-2 డీఎం సాయికుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ముందుగా స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఎంఈవో నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని తిర్మలాపూర్ క్యాంప్, కొత్తబాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమని, ధైర్యంగా పరీక్షలను ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో పొందిన విద్య, విలువలు, గురువుల మార్గదర్శనం విద్యార్థుల భవిష్యత్ జీవితానికి బలమైన పునాది అవుతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, హన్మాండ్లు, బి.రాజేశ్వర్, జి.ఆనంద్ కుమార్, బి.ప్రవీణ్ కుమార్, బి.విఠల్ రెడ్డి, జి.శంకర్, వి.పుష్పలత, ఎస్.నవీన్ కుమార్, జె.పీరియా నాయక్, కె.మహేష్ తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఊరూవాడా.. రంగుల హోరు





నిజామాబాద్ నగరంలోని బీజేపీ కార్యాలయంలో హోలీ సంబరాలు..



నగరంలోని గోశాలలో..



నగరంలోని మార్వాడీ గల్లీలో..



నగరంలో..



బంగారు దుకాణాల అసోసియేషన్ ఆధ్వర్యంలో..



పోచంపాడ్‌లో..

